ప్రజాశక్తి

గురువారం 20 జూన్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అమరావతికి పూర్వవైభవం

- రాజధాని గ్రామాల్లో నేడు చంద్రబాబు పర్యటన
- అమరావతి అసంపూర్తి నిర్మాణాలపరిశీలన
- శంకుస్థాపన ప్రదేశం సందర్శన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాజధాని ప్రాంతంలో పర్యటించనున్నారు. ఉండవల్లిలోని ప్రజా వేదిక నుంచి ఉదయం 11 గంటలకు పర్యటన ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి 2015 అక్టోబరు 22న ఉద్దండరాయునిపాలెంలో రాజధానికి శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని ఆయన సందర్శించనున్నారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డు, ఆల్‌ఇండియా సర్వీసెస్ అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు, ఐకానిక్ నిర్మాణాల కోసం శంకుస్థాపన చేసిన ప్రదేశాలను ఆయన పరిశీలించనున్నారు. సిఆర్‌డిఎ కార్యాలయాన్ని సందర్శించి తరువాత మీడియాతో మాట్లాడి వెలగపూడి సచివాలయానికి వెళ్తారని ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు.

వైసిపి హయాంలో ఐదేళ్లపాటు రాజధాని పనులు నిలిచిపోయిన నేపథ్యంలో తిరిగి పనులు ప్రారంభించేందుకు రూపొందించాల్సిన కార్యచరణ ప్రణాళికపై అధికారులతో చర్చిస్తారు. తక్షణం చేపట్టాల్సిన పనులు, దీర్ఘకాలికంగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్షిస్తారు. 80 శాతం పూర్తయిన భవనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి రాబోయే ఆరునెలల్లో వీటిని వినియోగంలోకి తేవాలని యోచిస్తున్నారు. 8603 కిలో మీటర్ల పరిధిలో సిఆర్‌డిఎ ఏర్పాటు చేశారు. 217 కిలో మీటర్ల మేరకు కోర్ కేపిటల్‌గా నిర్ధారించారు. రూ.225 కోట్లతో నిర్మించిన ▶ 2లో



గత టిడిపి ప్రభుత్వ హయాంలో రాయపూడిలో నిర్మాణం చేపట్టిన ఐఎఎస్, ఐపిఎస్‌ల గృహ సముదాయం



విసి చాంబరు ఎదుట బైఠాయించిన అమరావతి రైతులు

వర్సిటీ ఎదుట రాజధాని రైతుల ఆందోళన

వీసీపై ప్రశ్నల వర్షం - తక్షణమే రాజీనామాకు డిమాండ్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మూడు రాజధానులకు మద్దతుగా నాగార్జున విశ్వవిద్యాలయంలో సదస్సులు పెట్టిన విసి రాజశేఖర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రాజధాని రైతులు, టిఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థి ▶ 2లో

పట్టపగలే వృద్ధురాలి దారుణ హత్య

స్కూటీపై వచ్చి దాడిచేసి పరారైన దుండగులు



ప్రజాశక్తి - వినుకొండ

సొమ్ము కోసం వృద్ధురాలని హత్య చేసిన సంఘటన పట్టణంలోని కొత్తపేట విద్యానగర్ 6వ లైన్‌లో బుధవారం జరిగింది. పల్నాడు జిల్లా క్రైమ్ బ్రాంచ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి వివరాల ప్రకారం... స్థానికురాలైన పి.కోటిరత్నమ్మ (75) భర్త ఏసుదాసు వేరే పని మీద బయటకు వెళ్లగా కుమారుడు రవి వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ కావడంతో ఆ విధుల్లో ఉన్నారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత కోటిరత్నం ఒక్కరే ఇంట్లో ఉండగా ఇద్దరు దుండగులు స్కూటీపై వచ్చి జొరబడ్డారు. కోటిరత్నమ్మపై దాడి చేశారు. ఆమె కంటిపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం ద ం డ గ ం ల ం పారిపోయారు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకునేందుకు ఈ దాడి జరిగిందని, మృతురాలి మెడలో ఉండాల్సిన చైను ఆమె చేతిలో పట్టుకుని ఉన్నారని, దుండ గులను ప్రతిఘటించే క్రమంలో బలమైన గాయాలు తగలడంతో కోటిరత్నం మృతి చెందారని పోలీసులు భావిస్తున్నారు. దాడి ▶ 2లో

లక్షమందుంటే 65 వేల కార్డుల లక్ష్యమా?

- అధికభాగం భూమిని చేస్తున్నా పథకాలు దక్కని కౌల్దార్లు
- దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలివ్వాలి : కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలుకు సాగు చేయడమే అర్హతను ప్రామాణికంగా తీసుకొని గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి కౌలు రైతుకి గుర్తింపు కార్డు మంజూరు చేసి రాయితీపై రుణాలు విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. పల్నాడు జిల్లాలో సాగుదారుల్లో 60 శాతం మందికి పైగా కౌలు రైతులు ఉన్నారని లక్ష మందికి పైగా కౌలు రైతులుంటే జిల్లా ▶ 2లో

అరెస్టా? మళ్లీ బెయిలా? 2లో

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి నేటితో ముగియనున్న బెయిల్



విద్యారంగా అభివృద్ధికి కృషి చేస్తాం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

విద్యారంగా అభివృద్ధికి కషి చేస్తామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మన్యం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కిట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పాఠశాల ఇదని, ఈ పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల కొరత సమస్యను తీరుస్తామన్నారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటానని, పాఠశాలకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ధనలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.విజయసారది పాల్గొన్నారు.

28న జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని బంగ్లా గ్రౌండ్‌లో ఈనెల 28 న జూలకంటి నాగిరెడ్డి మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభించబడును. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.1,33,318, రెండవ బహుమతిగా రూ. 93, 318, మూడవ బహుమతిగా రూ. 63,318,నాలుగవ బహుమతిగా రూ.33,318, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.10,000, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, ప్రతి మ్యాచ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి అందజేయునట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు రూ.3000 ఎంట్రీ ఫీజుతో, టోర్న మెంట్ నిర్వాహకులు రామకృష్ణ (పొన్ను) 7337400575, శ్రీవాత్సవ 7416465482, కమిటీ వారిని సంప్రదించాలని కోరారు.

అమరావతికి పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

ఆరులైన్ల సీడ్ యాక్సెస్ రోడ్డు జాతీయ రహదారికి అనుసంధానం కాకుండా అసంపూర్తిగా ఉండిపోయింది. రాజధాని నిర్మాణం కోసం ఇప్పటి వరకు రూ.9, 165 కోట్లు వెచ్చించారు. పనులు జరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. 2019 మే నాటికి పురోగతిలో ఉన్న పనులన్నీ ఎక్కడికక్కడ నిలిపివేశారు. కాంట్రాక్టర్లు అంతా వెనుదిరిగారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి అభివృద్ధి మొత్తం ఆగిపోయింది. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో సిఎం జగన్ మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. వెంటనే ఏకైక రాజధాని అమరావతినే ప్రకటించాలని రైతులు 1632 రోజులు ఉద్యమించారు. ప్రధానంగా రాజధాని గ్రామాల్లో భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు అప్పగింత ఇంతవరకు జరగలేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులకు కాగితాలపై ప్లాట్లు అప్పగించారు. మొత్తం 54 వేల ప్లాట్లు భౌతికంగా అప్పగించలేదు. 26 రెవెన్యూ గ్రామాల్లో అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు ఇవ్వాల్సి ఉంది. 29 గ్రామాల పరిధిలో 22,948 మంది రైతులకు 28,128 ఎకరాల భూమికి రూ.183.17 కోట్లు కౌలు పరిహారం గతేడాది చెల్లించలేదు. ఈ ఏడాది కూడా ఇంత వరకు చెల్లింపులు జరగలేదు. మొత్తం రూ. 366.34 కోట్లు తక్షణం రైతులకు చెల్లించాల్సి ఉంది. 2016 నుంచి కౌలు చెల్లింపులు ప్రారంభించింది. 2026 వరకు ఈ చెల్లింపులు కొనసాగుతాయి. 29 గ్రామాల్లో 3 వేల మంది అసైన్డు రైతులున్నారు. మొత్తంగా అసంపూర్తిగా నిలిచిపోయిన అమరావతి నిర్మాణ పనులకు గ్రహణం వీడింది. టిడిపి రెండోసారి అధికారంలోకి రావడంతో అమరావతికి పూర్వవైభవం వస్తుందని భావిస్తున్నారు.

విత్తన దుకాణాలపై విజిలెన్సు దాడులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



చేబ్రోలులో స్వాధీనం చేసుకున్న వరివిత్తనాలు

గుంటూరు,పల్నాడు జిల్లాల్లో విజిలెన్సు అధికారులు బుధవారం పలు చోట్ల దాడులు నిర్వహించారు. చేబ్రోలు మరియు పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం మర్రిపాలెంలోని సీడ్స్ షాపులలో వ్యవసాయ శాఖ వారి అనుమతులు లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్టు గుర్తించారు. గుంటూరు రీజనల్ విజిలెన్సు ఎన్ఫోర్సు మెంట్ అధికారి కె. ఈశ్వర రావు గారి పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. చేబ్రోలు లోని రాధా ఎంటర్ ప్రైజెస్ యజమాని గోపిశెట్టి శ్రీనివాస్, మూసాలా వేణు ఇంటి వెనుక ఉన్న గోడౌన్ అద్దెకు తీసుకొని అక్రమంగా వరి విత్తనములు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. రూ. 3.96 లక్షల విలువైన 200 బస్తాల వరి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం మర్రిపాలెంలోని హనుమాన్ సీడ్స్ సెంటర్ లో తనిఖీ చేయగా 5 కంపెనీ లకు చెందిన సోర్స్ సర్టిఫికెట్లు లేకుండా హైబ్రిడ్ విత్తనాలు అమ్ముతుండగా పట్టుకున్నారు. రూ. 6.94 లక్షల విలువైన 10 కిలోల హైబ్రిడ్ విత్తనాల స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ ఇన్స్పెక్టర్ ఏ.శ్రీహరి రావు, వ్యవసాయ అధికారి రమణ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఎం. రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలిన గాయాలకు ప్రత్యేక వార్డు

20 పడకల తో అన్ని వసతుల కేటాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో కాలిన గాయాలకు ప్రత్యేక వార్డు ను కేటాయిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఎన్ టి ఆర్ యూనివర్సిటీ లో డైరెక్టర్ గా పని చేసిన డాక్టర్ సుమితా శంకర్ జీజీహెచ్ లో ప్లాస్టిక్ సర్జరీ హెచ్ ఓ డి గా బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యం అందించే విధంగా కషి చేయాలనీ అయన సూచించారు. ఆధునిక, సంక్లిష్టమైన ఆపరేషన్ లు చేసి ఆసుపత్రి కి మంచి పేరు తీసుకుని రావాలని అయన కోరారు.త్వరలో కాలిన గాయాలకు చికిత్సలకు 20 పడకలతో ప్రత్యేక వార్డును కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ వార్డు లో అన్ని వసతులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అనుబంధంగా వార్డు ను కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు.

అన్నా క్యాంటీన్ ఆధునీకరణకు రూ.4 లక్షలు

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక అన్న క్యాంటీన్ బిల్డింగ్ మరమ్మతులు పూర్తి చేసి ఆధునీకరించేందుకు రూ.4 లక్షల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ దేవళ్ల వెంకటదాసు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ లైటింగ్ ఇతర పనుల పూర్తి చేసి అన్న క్యాంటీన్‌ను ఆధునీకరణ చేసేందుకు మున్సిపల్ ఇంజినీర్ ద్వారా అంచనా వేసి సదరు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో అన్న క్యాంటీన్ ఉన్నందున నిధులు మంజూరు కాగానే పనులు నిబంధనల మేరకు పూర్తి చేస్తామన్నారు. అన్నెం అనంతరావమ్మ, షేక్ యాసిన్‌బాబులు తమ కో-అప్షన్ పదవులకు రాజీనామా చేయగా సదరు రాజీనామాలకు ఆమోదం లభించినట్లు తెలిపారు. పట్టణ శివారు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు 5 వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పబ్లిక్ టాయ్‌లెట్స్ ఏర్పాటుకు స్థలాల పరిశీలించామన్నారు. ఇదిలా ఉండగా పట్టణ పరిధిలో 13 మంది వాలంటీర్లు రాజీనామాలు చేసినట్లు తెలిపారు.

అరెస్టా? మళ్లీ బెయిలా?

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి నేటితో ముగియనున్న బెయిల్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజున మాచర్ల నియోజకవర్గమైన రెంటచింతల మండలంలోని పాల్వాయిగేటు వద్ద పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి బెయిల్ గడువు గురువారంతో ముగియనుంది. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోనే ఉంటూ ప్రతిరోజూ ఎస్పీ కార్యాలయంలో సంతకం పెట్టాలనే షరతులతో ఆయన బుధవారమూ ఎస్పీ కార్యాలయానికి వచ్చి సంతకం చేశారు. నేటితో బెయిల్ ముగుస్తున్నందున ఆయనకు మళ్లీ బెయిల్ వస్తుందా? లేదా? అరెస్టు చేస్తారా? అనే ఉత్కంఠ నెలకొంది.



ఎస్పీ కార్యాలయంలో సంతకం పెట్టి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వర్సిటీ ఎదుట రాజధాని రైతుల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

సంఘం నేతలు బుధవారం వర్సిటీ వద్ద ఆందోళన చేపట్టారు. రాజధాని రైతులు ప్రదర్శనగా విశ్వవిద్యాయలం ప్రధాన గేటు కుండా లోపలికి ప్రవేశించారు. విసి చాంబర్‌కు తాళం వేశారు. వైసిపికి తొత్తుగా వ్యవహరించి, రాజధాని రైతులకు నష్టం చేకూర్చేలా సదస్సులు పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వీసీ పి.రాజశేఖర్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. రాజధానికి వ్యతిరేకంగా సదస్సులు పెట్టే అధికారం ఎవ్వరిచ్చారని ధ్వజమెత్తారు. అధికారిగా ఉంటూ ఒక ప్రాంతానికి వ్యతిరేకంగా సదస్సులు ఎలా నిర్వహిస్తారని విసిని నిలదీశారు. పోలీసుల బందోబస్తు మధ్య రైతుల వద్దకు వచ్చిన విసి రాజశేఖర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను తొలుత విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు అడ్డగించారు. తరువాత వీసీని కలిసి వినతిపత్రం ఇస్తామని చెప్పడంతో లోపలికి అనుమతించారు.

పట్టపగలే వృద్ధురాలి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంలో ఇంటి వెనుక భాగంలో ఉన్న బాలుడు ఈ విషయాన్ని చెప్పారని, వీధిలో ఉన్న సీసీ కెమెరాలు ఆధారంగా హంతకులను గుర్తించే ప్రయత్నంలో ఉన్నామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలిని పట్టణ సిఐ సాంబశివరావు పరిశీలించారు. మృతురాలి భర్త ఏసుదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గుంటూరు నుండి వేలిముద్రల సేకరణ బృందాన్ని రప్పించి వివరాలు సేకరించారు.

ఇదిలా ఉండగా ఈ ఘటనతో కొత్తపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రతిరోజూ కోటిరత్నమ్మ ఆ ప్రాంత మహిళలతో అరుగుల మీద కూర్చొని సరదాగా మాట్లాడేవారని, ఆ సమయంలో ఆమెపై ఉన్న బంగారాన్ని గమనించిన దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. పట్ట పగలు హత్య చేసి హంతకులు వారిపోవటం వంటివి ఎప్పుడూ ఈ ప్రాంతంలో జరగలేదని అంటున్నారు. ఒకవైపు కాల్వ కట్ట బజార్, మరోవైపు గీతాంజలి స్కూల్ ఎదురు బజార్, కూత వేటులో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల నివాసాలు, ప్రతిరోజు అధికారులు, ప్రజల సంచారంతో రద్దీగా ఉండే ప్రాతంలో దారుణం ఏమిటని భయపడుతున్నారు.

లక్షమందుంటే 65 వేల కార్డుల లక్ష్యమా?

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ అధికారులు 65 వేల కార్డుల మంజూరు లక్ష్యం నిర్దేశించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. సాగుకు సంబంధించి ప్రభుత్వ పథకాలేమీ కౌలురైతులకు అందడంలేదని, వాస్తవ సాగుదార్లనైన కౌలురైతుల వ్యవసాయంలో నష్టాలను భరిస్తున్నారని గుర్తు చేశారు. పెట్టుబడి సాయం, వడ్డీ రాయితీతో కూడిన పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందడం లేదని, పంట నష్టం, బీమా పరిహారం రావడం లేదని, చివరికి కౌల్దార్ల సాగులో ఉన్న పంటనూ ఈ-క్రాప్‌లో నమోదు చేయడంలేదని తెలిపారు. పంటను మద్దతు ధరకు మార్కెట్ యార్డు ద్వారా అమ్ముకునే అవకాశమూ కౌల్దారుకు దక్కడం లేదని తెలిపారు.

2011లో భూ అధీకత సాగురైతుల చట్టం ప్రకారం కౌలురైతుల సెల్ఫ్ డిక్లరేషన్ ఆధారంగా మండల రెవిన్యూ అధికారుల త్రిసభ్య కమిటి పరిశీలించి, గ్రామ సభల ద్వారా కౌలురైతులకు రుణార్హత కార్డు (ఎల్ఇసి)లను ఇచ్చేవారని, దీనిద్వారా కొన్ని పథకాలు పొందే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసి నీతి అయోగ్ సిఫార్సుల మేరకు 'పంట సాగు దారుల హక్కు చట్టం -2019' తెచ్చిందని, ప్రభుత్వ అధికారులు, గ్రామ సభలతో పని లేకుండా భూ యజమాని అంగీకారంతో, కౌలు రైతుల అర్జీలపై భూ యజమాని సంతకం ఉండాలని చట్టంలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఒక వ్యక్తి పై ఆధారపడి కార్డులు ఇవ్వడం అనేది అనేక అవకతవకలకు దారితీసిందని, దీంట్లో అధికార పార్టీ చేతివాటాన్ని ప్రదర్శించడంతో పారదర్శకత లేకపోవడంతో కౌలురైతులకు కాకుండా సాగులో లేని వారికి కార్డులు వచ్చాయని తెలిపారు. భూయజమానులు రాత పూర్వకంగా కౌలుకిస్తే భూ హక్కులకు సంబంధించి ఇబ్బందులు వస్తాయనే అపోహతో సంతకం చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం మేనిఫేస్టో ప్రకారం ప్రతి కౌలురైతుకి కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలురైతులకు మెరుగైన పథకాలు ఆందజేయాలని, ఆత్మహత్య పర్వం కొనసాగకుండా సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

డిమాండ్లు :

రైతుల సంక్షేమం కోసం పనిచేసే సంఘాలతో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రభుత్వం సమావేశాలు జరపాలి. కౌలు రైతు కార్డు పొందడానికి ఉన్న ఆటంకాలను చట్టం నుండి తొలగించాలి. గ్రామ సచివాలయ పరిధిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు బాధ్యతతో కార్డులు మంజూరు చేయాలి. ఏరోజు కారోజు కౌలు రైతుల పేర్లను సచివాలయంలో ప్రదర్శించాలి. కౌలురైతు సొంతభూమి, కౌలుభూమి వివరాలు స్పష్టంగా తెలపాలి. రైతు భరోసా రూ.20 వేలు, కేంద్రం ఇస్తున్న రూ .6 వేలను భూమి లేని కౌలురైతులకు ఇవ్వాలి. ప్రతి కౌలురైతు పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ప్రతి కౌలు రైతుకు రూ .1.60 లక్షల వరకు హామీ లేని రుణాలివ్వాలి. కౌలురైతుల కార్డుల ధరఖాస్తు ఫారాలు సచివాలయంలో అందుబాటులో ఉంచడంతో పాటు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయాలి.

భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అపార్టుమెంట్‌పై నుంచి పడి భవన నిర్మాణ కార్మి కుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి పట్ట ణంలో బుధవారం జరిగింది. ఈ ప్రమాదంలో రొంపి చర్ల మండలం విప్పర్ల రెడ్డి పాలెం ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల ఇస్సాకు (41) ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు.సత్తెనపల్లి పట్టణంలోని హోలీ ఫ్యామిలీ స్కూల్ సమీపంలో ఉన్న ఓ అపార్ట్ మెంట్ లో సెంట్రిగ్ కార్మికుడు గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా గాయపడిన కార్మికుడ్ని నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వ్యవసాయ బావిలో పొడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు ఈ సంఘటన సత్తెనపల్లి మండలం కట్టమూరు శివారులో మంగళవారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన దాసరి ఏసుబాబు (22) మృతి చెందాడు. వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉందన్న సమాచారం మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు ఏసుబాబుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంచర్ల శివశంకర్‌కు టిడిపి నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రకాష్ నగర్ లో కంచర్ల శివశంకర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం తాడేపల్లి టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు హాజరై శంకర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి బెజ్జం రామకృష్ణారావు, ఆర్‌కె, తాడేపల్లి పట్టణ బిసి ఉపాధ్యక్షులు కంచర్ల శివప్రసాదరావు, తాడేపల్లి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గుద్దంటి నాగేశ్వరరావు, మాజీ మంగళగిరి నియోజకవర్గ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొర్రపాటి రమణ, గోరా శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట బస్టాండులో ఆక్రమణలు తొలగించాలి

ఆర్టీసీ ఆర్ఎం, డిఎంతో కలిసి సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాకపోకల నిమిత్తం బస్టాండుకు వచ్చే ప్రజలకు, ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, మెరుగైన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించొద్దని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ లో సదుపాయాలను ఆర్టీసీ ఆర్ఎం,ఆర్టీసీ డిఎంతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో ఆక్రమణలకు గురైన స్థలాలను,చిన్నాభిన్నంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ను చూసి ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రయాణికులు బస్టాండ్ చేరగానే ప్రశాంతంగా కనిపించాలి గాని అవస్థలమయమై కనిపించకూడదని



అన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్, ఆర్టీసీ అధికారులు,టిడిపి శ్రేణులు పాల్గొన్నాయి.

అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగంచేసుకోండి

సిడిపిఒ ఎస్.వెంకట రమణ

ప్రజాశక్తి- పొన్నూరు

మూడేళ్ల నుండి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని సిడిపిఓ ఎస్ వెంకటరమణ అన్నారు. బుధవారం 1,2,3,5వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాలలో ఆటపాటల విద్యతో పాటు పౌష్టికాహారం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. బడిబాట కార్యక్రమం



ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శ్యామల, అంగన్వాడీ టీచర్ సుకన్య కార్యకర్తలు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' ప్రారంభం

ప్రజాశక్తి -తెనాలి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ప్రవేశాలను పెంచేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి-2 వి జయంతి బాబు చెప్పారు. స్థానిక చెంచుపేట కోనేరు సెంటర్ లో బుధవారం ఎంఈఓ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాల బాలికలు అందరినీ పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా



ఎంఈఓతో పాటు ఆఫీస్ సిఆర్ఎంటిలు , ఐ ఈ ఆర్ టి ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



పౌరసరఫరాల శాఖ గోదాములో తనిఖీలు

ప్రజాశక్తి-తాడికొండ

నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ పౌరసరఫరాల శాఖ గోదాములో బుధవారం జిల్లా లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం ఎస్ ఎన్ మాధురి తనిఖీలు నిర్వహించారు. గోదాములో రికార్డులను పరిశీలించారు.బియ్యం గోతాలలో వ్యత్యాసం ,కందిపప్పు 20 గ్రాములు, పంచదార 20 గ్రాములు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించి, సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్ పై కేసు నమోదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ జి.కొండారెడ్డి,డీఈవో రామకృష్ణ ,సివిల్ సప్లై ఆర్ .ఐ.అనిల్ కుమార్ గోదాము డిటి నరసింహమూర్తి పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో స్క్వాడ్ బృందం తనిఖీ

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే వివిధ విత్తన దుకాణాలను బుధవారం స్క్వాడ్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. మొత్తం ఐదు దుకాణాల్లోనే స్టాక్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు వద్ద రసీదులు ఉన్నాయా లేదా అని స్వయంగా పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని స్క్వాడ్ ఏడిఏ రవిబాబు కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం వైసీపీ యువనేత భవనం వంశీరెడ్డి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వారి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని మొక్క నాటాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 56,542
మిర్చి ఎగుమతి	: 53,638
మిర్చి నిల్వ	: 16,907

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 18,000
నెం.5	9,000 - 16,000
273	13,000 - 17,000
341	9,000 - 17,000
4884	12,500 - 13,700
నాన్ ఎసి	
తేజ	8,000 - 20,000
బడిగి	8,500 - 17,000
దేవనూరు డీలక్స్	9,000 - 16,700
తాలుకాయలు	4,500 - 11,500
ఎసి	
334	9,500 -16,000
నెం.5	9,300 - 15,800
273	15,000 - 15,500
341	8,500 - 17,000
తేజ	10,000 - 19,500
బడిగి	10,000 - 17,000
దేవనూరు డీలక్స్	16,000 - 16,000
తాలుకాయలు	5,000 -12,000

గంజాయి విక్రేతల అరెస్టు

- మంగళగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు, పాతూరులో ఓ యువకుడు అరెస్టు
- ఒక చోట1400 గ్రాములు, మరో చోట కిలోకు పైగా గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మంగళగిరి పట్టణ సిఐ శ్రీనివాసరావు, తాడేపల్లి సిఐ కళ్యాణ రాజు

ప్రజాశక్తి-మంగళగిరి

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 1400 గ్రాముల గంజాయిని స్వాధీనపరుచుకున్నట్లు మంగళగిరి పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు మంగళగిరి పట్టణానికి చెందిన షేక్ మహబూబ్ సుభాని, కాజా గ్రామానికి చెందిన దొడ్డక పవన్ కుమార్ లు మంగళగిరి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిద్దరిని అరెస్టు చేసి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సిఐ ఎం. శ్రీనివాసరావు

నట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మంగళగిరి పట్టణంలో గతంలో సుమారు 30 మంది అనుమానితులు ఉన్నారని వీరిలో కొంతమంది మానేశారని, మరికొందరు ఇంకా విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. గంజాయి ఎక్కడినుంచి వస్తుందనే దానిపై, ఎక్కడ, ఎవరు విక్రయిస్తున్నారనే విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అమ్మకాలకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. మంగళగిరి పట్టణాన్ని గంజాయి రహిత చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డడి, నార్త్ సబ్ డివిజన్ డి.ఎస్.పి సిహెచ్ రవికాంత్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై షేక్ ఖాదర్ బాషా, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

ప్రాతూరులో ..

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

గంజాయి విక్రాయలు జరుపుతున్న ఎంటిఎంసి పరిధిలోని పాతూరు గ్రామం లో ప్రశాంత్ అనే యువకుడిని తాడేపల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుండి కేజీ 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తాడేపల్లి సిఐ కళ్యాణ రాజు తెలిపారు. నిందితుడని కోర్టుకు హాజరు పరిచామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిఐ కళ్యాణ రాజు మాట్లాడుతూ గంజాయి సేవించిన, విక్రయాలు జరిపిన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లి సిఐ కళ్యాణ రాజు



హాస్టల్లో జెసి పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వసతి గృహాల్లో ఉండి విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామం వద్ద గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. బాలురకు అందిస్తున్న వసతి సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి స్టడీ అవర్స్‌లో సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతిని, వంటశాలను పరిశీలించి సూచనలిచ్చారు.



ఎన్టీఆర్ పార్కుకు నిర్లక్ష్య గ్రహణం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఆహ్లాదాన్ని పంచడంతోపాటు అలసటతో వచ్చిన వారు ప్రశాంతంగా సేదదీరటానికి 2015లో రూ.14 లక్షలతో నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో పార్కులను ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకోవడానికి కొన్ని వస్తువులు ఏర్పాటు చేయడంతో కొంతమంది తమ పిల్లల్ని తెచ్చి ఆడించుకోగా, మరికొందరు వాకింగ్ చేసేవారు. కొన్నేళ్ళు ఇలా గడిచాక వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్కు నిర్వహణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. పార్కు నిండా పిచ్చి కంప, గడ్డి మొక్కలు పెరగడంతోపాటు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. పాముల సంచారమూ మొదలైంది. ప్రస్తుత ప్రభుత్వమైనా ఈ పార్కును మళ్లీ వినియోగంలోకి తెచ్చి అభివృద్ధి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు శ్రీనివాసరావు, ఇతరులు కోరుతున్నారు. అధికారులు సత్వరమే స్పందించాలన్నారు.

పార్కును అభివృద్ధి చేస్తాం

జాగర్లమూడి రఘుపతిరావు, ఉపసర్పంచ్, పెదకూరపాడు

ఎన్టీఆర్ పార్కును టిడిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశాం. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి మళ్లీ వచ్చినందున అభివృద్ధి చేస్తాం. పార్కు నిర్వహణను గత వైసిపి ప్రభుత్వం విస్మరించడంతో అపరిశుభ్రంగా తయారైంది. దీన్ని శుభ్రంగా చేసి మళ్లీ వినియోగంలోకి తెస్తాం



ఎవరూ రాజీనామాలు చేయొద్దు..

- అంగన్వాడీల ఉద్యోగాలెక్కడికీ పోవు
- ఈ సమయాల్లోనే ఐకమత్యంగా ఉండాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్
- ఎమ్మెల్యే పుల్లారావును కలిసి సమస్యలపై వినతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అంగన్వాడీల ఉద్యోగాలు ఎక్కడికీ పోవని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, లేనిపోని అపోహలతో ఎవరూ తొందరపడి రాజీనామాలు చేయొద్దని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి అన్నారు. స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీల సమావేశం బుధవారం నిర్వహించారు. అంగన్వాడీలపై జిల్లా వ్యాప్తంగా వస్తున్న ఒత్తిళ్లపై మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇటువంటి ఒత్తిళ్లు సహజమేనని, వీటికే భయపడి రాజీనామాల వరకూ వెళ్లొద్దని చెప్పారు. ఇలాంటి సమయాల్లోనే ఐకమత్యంతో మెలగాలన్నారు. ఇంతకంటే ఎక్కువ ఒత్తిళ్లనే గతంలో అనేకం అధిగమించామని, జీతాలు పెంచకపోవడం, యాప్‌లతో అధిక పని, ఇతర వేధింపులను పోరాటాల ద్వారా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. వీరికి సంఘీభావంగా కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడులతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా, లేదా కార్మికులుగా గుర్తిస్తే ఈ సమస్యలు రావని అన్నారు. తప్పేమీ చేయకున్నా రాజకీయ కారణాలతో, ఇతర ఒత్తిళ్లతో అంగన్వాడీలను ఉన్నఫళంగా తొలగిస్తే వారి కుటుంబాలు ఏం కావాలని ప్రశ్నించారు. వైసిపి వాళ్లు అన్యాయం చేశారంటూ టిడిపి వారు సైతం అదే తరహాలో ప్రవర్తించడం సరికాదన్నారు. ఒత్తిళ్ల కారణంగా గతంలో వినుకొండలో అజంతాభాయ్ ఆత్మహత్యాయత్నం చేసిన సందర్భంలో ప్రజా సంఘాలు చూపిన ఐకమత్యాన్ని గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు జి.సావిత్రి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పుల్లారావుతో మాట్లాడుతున్న అంగన్వాడీలు, నాయకులు



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

యంత్రాంగం మొత్తం ప్రక్షాళనకు అడుగులు

- రైతుల తర్వాతే ఎవరైనా - పంటలకు మద్దతు ధరలు ప్రభుత్వ బాధ్యత
- యార్డు కమర్షియల్ కాంప్లెక్స్‌లో అగ్రిమెంట్ పూర్తయిన వారు ఖాళీ చేయాలి
- యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే అరవిందబాబు, అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వ యంత్రాంగం మొత్తాన్ని ప్రక్షాళన చేసేందుకు అడుగులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారి వ్యవస్థ లేకుండా రైతులకు కమీషన్ ఏజంట్లకు అనుసంధానంగా యార్డు కమిటీ వ్యవహరించేలా సిబ్బంది వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్లు, కాంప్లెక్సులు, ఇతర రంగాలపై అధికారులతో సమీక్షించారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో పలు ప్రాంతాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమం కోసం భూసార పరీక్షలు నిర్వహించాలని అధికారులకు చెప్పారు. యార్డు ప్రాంగణంలో నిర్మిస్తున్న రక్షిత నీటి పథకం ద్వారా పట్టణ శివారు ప్రాంతమైన ఎస్.ఆర్.కె.టి కాలనీ పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్ యార్డు, కమర్షియల్ కాంప్లెక్స్ షాపులు నుండి వెంటనే అద్దె బకాయిలు వసూలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అగ్రిమెంట్ టైం పూర్తి అయినా షాపులు అప్పగించని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెట్ యార్డు నూతన ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం, గోడౌన్స్ రిపేర్లు చేయించి రైతులకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల తర్వాతనే ఎవరైనా అన్నారు. రైతు సుభిక్షంగా ఉన్న రోజు మాత్రమే రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరుగుతుందని, వారికి మద్దతు ధరలు కల్పించి, పంటలు అమ్ముకోవడానికి మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి, ఎ.డి.ఎం సూర్యప్రకాశ్‌రెడ్డి, మార్కెట్ సెక్రెటరీ ఆంజనేయులు, మున్సిపల్ డి.ఈ శ్రీనివాసరావు, రాష్ట్ర గోల్డ్ బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు కడియాల రమేష్, బొడ్డపాటి పేరయ్య, మాజీ కౌన్సిలర్లు వాసిరెడ్డి రవి, కొట్టా కిరణ్, కొవ్వూరు బాబు పాల్గొన్నారు.

మాజీ కలెక్టర్‌ను కలిసిన అరవిందబాబు

పల్నాడు జిల్లా మాజీ కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను ఎమ్మెల్యే అరవిందబాబు కలెక్టర్ బంగ్లాలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేసిన కృషి అభినందనీయం



అన్నారు. నియోజక వర్గాన్ని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని వీలున్నప్పుడల్లా సంప్రదిస్తానని చెప్పారు.

మహేష్‌రెడ్డి రాజకీయ సన్యాసం చేస్తారని అనుకుంటున్నా

భూ అక్రమ రిజిస్ట్రేషన్లపై చర్యలు

తప్పుచేసిన వారికి శిక్షలేగాని ప్రతిదాడులుండవ్

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



ఇటీవల ఎన్నికల్లో తామిద్దరిలో ఓడిన వారు రాజకీయ సన్యాసం చేయాలనే తన సవాలును మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్వీకరించారని, దానికనుగుణంగా ఆయన తప్పకుండా రాజకీయ సన్యాసం తీసుకుంటారని భావిస్తున్నానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అరాచక పాలనతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. 1984లో ఎన్‌టిఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీకి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 26 సీట్లు మాత్రమే వచ్చాయని, అదే తరహాలో ఇప్పుడు వైసిపికి 11 సీట్లు వచ్చాయని అన్నారు. ప్రజల అప్పగించిన గురుతర బాధ్యతను నెరవేరుస్తామన్నారు. వైసిపి పాలనలో గురజాల నియోజకవర్గంలో 11 మంది టిడిపి నాయకులు చంపబడ్డారని, ఎనిమిది మంది చిన్నారులు అక్రమైనింగ్ గుంతలో పడి చనిపోయారని అన్నారు. అక్రమ మైనింగ్, కల్తీ మద్యం, పేకాట క్లబ్బులు, ఇసుక అక్రమ రవాణా ఇలా అనేక అక్రమాలకు గురజాల నియోజకవర్గంలోనూ పాల్పడ్డారన్నారు. వేలాది ఎకరాలు ప్రభుత్వ, ప్రైవేటు, దేవాదాయ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామేగాని ప్రతిదాడులు తమ పద్ధతి కాదన్నారు. తప్పు చేసిన వారికి శిక్షపడేలా చేస్తామన్నారు. వ్యాపారులపైగాని, వైసిపి నాయకులపైగాని దాడులు జరుగుతుంటే తనకు ఫోన్ చేయాలని గతంలోనే చెప్పానని, ఇటీవల ఓ గ్రామంలో వైసిపి నాయకులపై దాడి జరుగుతుందని వారు ఫోన్ చేస్తే తమ పార్టీ నాయకుడని కూడా చూడకుండా జైలుకు పంపించామని అన్నారు. కూటమి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ హామీలతోపాటు గురజాలకు ఇచ్చిన ప్రత్యేక హామీలనూ అమలు చేస్తామని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు. నియోజకవర్గం యూనిట్లుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. జనసేన నాయకులు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఇంతటి ఘనవిజయాన్ని కూటమికి అప్పగించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

పురపాలక సంఘంగా తాడేపల్లి?

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిని మరలా పురపాలక సంఘంగా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తుంది. తాడేపల్లి మున్సిపా లిటీకి చెందిన దస్త్రాలన్నీ గతంలో కార్పొరేషన్ కార్యాలయం అయిన మంగళగిరికి తరలించారు. గత రెండు రోజుల నుంచి తాడేపల్లికి సంబంధించిన రికార్డులన్నీ లారీల్లో తిరిగి తాడేపల్లికి చేరు కుంటున్నాయి. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి కలిసి కార్పొరేషన్‌గా ఉన్నాయి. గతంలో మంగళగిరి, తాడేపల్లి మున్సి పాలిటీలు వేర్వేరుగా ఉండేవి. కృష్ణనగర్, తాడేపల్లిని కలిపి 2009లో మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అంతకు ముందు కృష్ణనగర్, తాడేపల్లి విడివిడిగా గ్రామపంచాయతీలుగా ఉన్నాయి. రెండు గ్రామాలు కలిసి మున్సిపాలిటీ అయిన తరువాత 23 వార్డులుగా ప్రకటించారు. ఐదు సంవత్సరాలు ప్రత్యేక అధికారులు పాలనే సాగింది. 2014లో తాడేపల్లి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. అప్పటికి రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉంది. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు టిడిపి పరం కాగా తాడేపల్లిని మాత్రం వైసిపి కైవసం చేసుకుంది. 2021లో తాడేపల్లి, మంగళగిరి కలిపి 50 వార్డులతో మెగా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి ప్రభుత్వం జిఒ 19 విడుదల చేసింది. 2021 నుంచి ఇప్పటి వరకు కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాడేపల్లి, మంగళగిరిని గతంలో లాగానే గ్రేడ్-1 మున్సిపాలిటీలుగా ప్రకటిస్తామని హామీనిచ్చింది. ఆ మేరకు పనులు చకచక జరుగుతున్నట్లు కనిపిస్తుంది. గత వారం రోజుల నుంచి గతంలో మంగళగిరికి చేరుకున్న తాడేపల్లికి చెందిన దస్త్రాలన్నీ తిరిగి తాడేపల్లికి





చేరుకుంటున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయడం తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీలు వేర్వేరుగా పరిపాలన సాగించే అవకాశాలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఇందుకు తాడేపల్లి పట్టణ ప్రజలు కూడా సుముఖంగా ఉన్నారు. ప్రస్తుత ఎంటిఎంసి కార్పొరేషన్‌లో తాడేపల్లికి సంబంధించి ఏ పని జరగా లన్నా మంగళగిరి వెళ్లాల్సి వస్తుందని ప్రజలు చెబుతు న్నారు. దీని వల్ల సమయం వృధా కావడమే కాకుండా అధికారులు అందుబాటులో లేక చిన్నపాటి పని కోసం కూడా రోజంతా సమయం వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు.

యజమానితో సంబంధం లేకుండా కౌలురైతు కార్డులు ఇప్పించాలి

ప్రజాశక్తి - తెనాలి

కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వారికి బ్యాంకు రుణాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. కౌలు రైతులతో బుధవారం స్థానిక ఐతానగర్ వద్ద సమావేశమైన సాంబిరెడ్డి వారి సమస్యలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులు గుర్తించకపోవడం బాధాకర మన్నారు. డెల్టా ప్రాంతంలో నూటికి దాదాపు 80శాతం కౌలు రైతులు ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం అందించే సబ్సిడీ, నష్టపరిహారం అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందకపోవటంతో వడ్డీలకు అప్పులు తెచ్చి మరింత నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో చొరవ చూపి కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలను అందించాలని కోరారు. అలాగే వ్యవసాయ పరికరాలు పవర్ స్ప్రేయర్లు, సీడ్ డ్రమ్మర్లు ఆయిల్ ఇంజన్లు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వంపుగళ్ళ హేమంత్, మేకల చిట్టిబాబు, వేజెండ్ల



నాగేశ్వరరావు, మేకల భాస్కరరావు, తెనాలి శ్యామ్, కూచిపూడి బాబురావు పాల్గొన్నారు.



ఏపీఎస్పీలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభించిన డిజిపి

మంగళగిరి ఏపీఎస్పీలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరిలోని ఆరవ పటాలములో బుధవారం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ సింగ్ మాట్లాడుతూ కుటుంబాల్లో మనస్పర్ధలు రాకుండా అందరూ కలిసికట్టుగా ఉండి కుటుంబ అభివద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బెటాలియన్స్ డిఐజి బి రాజకుమారి, కమాండెంట్ వి రత్న, అడిషనల్ కమాం డెంట్ రామకృష్ణ, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



మద్దిరాల కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్

తూర్పు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నసీర్ తెలియజేశారు. బుధవారం నసీర్ 57వ డివిజన్, మద్దిరాల కాలనీ, బసవతారక రామనగర్‌లలో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైడ్ డ్రైన్స్ నిర్మించకపోవటం వల్ల ఇబ్బంది పడుతున్నామని, చిన్నపాటి వర్షానికే మురుగునీరు ఇళ్లలోకి వస్తుందని ఆయా కాలనీల వాసులు వాపోయారు. ఇళ్లల్లోకి పాములు కూడా వస్తున్నాయని తెలిపారు. నీరు నిలిచి, కుంటలుగా మారి దోమలు వ్యాప్తి చెందుతున్నా యన్నాయని, ఫలితంగా అనారోగ్యం పాలవుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ నసీర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అసమర్ధత వల్ల నియోజకవర్గంలోని ప్రజలు అన్ని విధాల నష్టపోయారన్నారు. మద్దిరాల కాలనీ వాసుల సమస్య ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ముగురు కాల్వల నిర్మాణం చేపడతామని అన్నారు. మంచినీటి పైపులైన్లు, స్ట్రీట్‌లైట్స్ సమస్యలపై అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిఎంసి అధికారులు డిఈ శ్రీధర్, ఏఈ సునీల్, టిడిపి, జనసేన నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, కనకారావు, పల్లెపోగు రమేష్ పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో నిర్మలఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

పోస్ట్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ కొరకు రాష్ట్రవ్యాప్తంగా మే నెలలో నిర్వహించిన ఏపీ పీజీఈసెట్ ఫలితాలు లలో అశేష ప్రతిభను ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు కనపరిచారు. ఈ ఫలితాలలో పి. భాను శశాంక్ రాష్ట్రస్థాయి ప్రధమ ర్యాంకుతో అశేష ప్రతిభ కనబరచగా, ఎం. వర్షిత 20వ ర్యాంకు, కే జగదీష్ 68వ ర్యాంకు, ఏ సువర్ణ 184వ ర్యాంకు, సిహెచ్ సుప్రజ 115 వ ర్యాంకు, పి నాగ మౌనిక 142వ ర్యాంకు, ఇలా కళాశాలలో 35 మంది పైగా విద్యార్థులు ర్యాంకులను సాధించారు అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి పాముల రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థుల కొరకు అభినందన వేడుక ఏర్పాటు చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి ప్రతిభ కనబరిచి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినటువంటి భాను శశాంక్ ను శాలువాతో సత్కరించి పుష్పగుంచం అందజేశారు. ఈ సందర్భంగా









కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడం కళాశాలకు ఎంతో గర్వకారణమని, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఏమి సాధించ వచ్చో శశాంక్ నిరూపించాడని అంతేకాకుండా జీ పాట్ 2023లో కూడా అశేష ప్రతిభ కనపరిచిన విషయం గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ బి పాముల రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకే కాకుండా కళాశాల లోని విద్యార్థులకు 35 మందికి పైగా ర్యాంకులు రావడం ఎంతో సంతోషమని మరియు ఈ ర్యాంకులు ఆధారంగా ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వారికి నచ్చిన కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో అడ్మిషన్ పొందే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ అభినందన వేడుకలో విద్యార్థినీ విద్యార్థులతో పాటు కళాశాల అధ్యాపకులు డాక్టర్ సిహెచ్ సుప్రియ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సౌజన్య, డాక్టర్ జి స్వప్న, డాక్టర్ హరే కష్ణ రాయ, డాక్టర్ యు స్పందన, ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో ఆహార నియమాలపై అవగాహన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారత్ స్కౌట్స్ మరియు గైడ్స్ ఆద్వర్యం లో అంతర్ జాతీయ యోగ దినోత్సవవం 21 న పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 19 నుండి 23 వరకు భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆద్వర్యంలో సదరన్ రీజియన్ స్థాయి యోగ ,మరియు ఆహార నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమం వర్సిటీలోని సుదర్శన్ భవన్, యోగా మరియు మెడిటేషన్ సెంటర్‌లో ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమం జెండా ఆవిష్కరణ, మరియు ప్రారంభ సమావేశం నిర్వహించటం జరిగినది. కార్యక్రమంలో దక్షణాది రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, తెలంగాణ, గోవా, ఆంధ్ర ప్రదేశ్, అండమాన్ కర్నాటక, సదరన్ రైల్వే విభాగం నుండి స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. గుంటూరు ఉప విద్య శాఖ అధికారి వేంక టేశ్వర రావు, సదరన్ డైరెక్టర్ కుముద్ మెహరా, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఎస్ఒఎస్ శ్రీనివాసరావు మరియు స్కౌట్స్ మరియు గైడ్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇఒపిఆర్‌డికి వినతి పత్రం అందజేస్తున్న వై నేతాజి తదితరులు

పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం : కార్మికులకు గత 6 నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడం అన్యాయమని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)జిల్లా గౌరవాధ్యక్షులు వై నేతాజి అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెంలో నాయకులు సిహెచ్ రామారావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేతాజీ ప్రసంగించారు. జూన్ నెలాఖరు కావస్తున్నా ఇంతవరకు టెండర్ కార్మికుల ప్రతిపాదనలను పంపబడలేదని, కొన్ని గ్రామాల్లో బండ్లు రిపేర్ అయ్యి వాటితో పని చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదని అన్నారు. నిత్యం మురికి కుపంలో పనిచేస్తున్న కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు, గ్లౌజులు, కండువాలు నెలల తరబడి ఇవ్వటం ఆపేసారని దీంతో కార్మికులు అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఒకపక్క నిత్యవసర వస్తువులు నిత్యం పెరుగుతున్న వీరి జీతాలు మాత్రం పెరగటం లేదని, దీంతో కుటుంబ పోషణ భారం అయ్యిందని అన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్‌కె మస్తాన్‌వలి, అధ్యక్షులుగా సిహెచ్ రామారావు, ఉపాధ్యక్షులుగా కె సాగర్, ప్రధాన కార్యదర్శిగా పి మేనకరావు, కమిటీ సభ్యులుగా ఎన్ శ్రావణ్ కుమార్, డి అచ్చయ్య, ఆర్ మాధవరావు, ఆర్ రాజేశ్వరరావు, ఎస్ ఆంటోని, బి వేలంగనేని ఎన్నుకున్నారు. అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డికి వినతి పత్రం ఇచ్చారు.




మిడ్డేమీల్ కార్మికుల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి -దుగ్గిరాల :మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు పెంచాలని మధ్యాహ్నం భోజనం పథకం యూనియన్ (సిఐటియు)జిల్లా గౌరవాధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ ప్రభు త్వాన్ని కోరారు. దుగ్గిరాలలో శైలజ అధ్యక్షతన జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ పేద పిల్లలను డ్రాపౌట్స్ నుండి తగ్గించేందుకు ఏర్పాటుచేసిన ఈ పథకంలో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం కూడా ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. రూ.3000తో కుటుంబాలు ఎలా గడుస్తాయో పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. వీరికి గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా కే శైలజ, ఎం రత్న కుమారీలను, కోశాధికారిగా నాగరాజుకుమారి, ఉపా ధ్యక్షులుగా వసంత కుమారి, సహాయ కార్యదర్శులు రాజకుమారి మండల గౌరవ అధ్యక్షులుగా శ్రీనివాసరావును ఎన్నుకోవడం జరిగింది.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు గురు వారం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.మందడం, తుళ్లూరు, పెదపరిమి, రాయపూడి, మల్కాపురం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, బెల్టులు తదితర సామగ్రి అందజేశారు. తుళ్లూరులో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి సాంబశివరావు, శేఖర్, టిడిపి నాయకులు మేరిగ నాగేశ్వరరావు, జెట్టి దుర్గారావు, మంద డం లో టిడిపి మండల తెలుగు మహిళా అధ్యక్షు రాలు యర్రమనేని నాగ మల్లీశ్వరి, గ్రామ అధ్య క్షులు ఆలూరి సుబ్రహ్మణ్యం పాల్గొ న్నారు.



తుళ్లూరులో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ


చిలకలూరిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు


సత్తెనపల్లిలో

రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కులాల కుమ్ములాటలు, మతాల మధ్య విద్వేషాలు, ప్రజల ఐక్యతకు చిచ్చు పెట్టే పాలనా విధానాలతో విసిగి పోయిన ప్రజలకు అభిమానం, ప్రేమ పెంచడమే నిజమైన రాజకీయ మని చాటి చెప్పిన వ్యక్తి రాహుల్ గాంధీ అని రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం. రాధాకృష్ణ అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, ఎంపి రాహుల్ గాంధీ 54వ పుట్టిన రోజు వేడుకలు బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును నాయకులు, కార్యకర్తలు కట్ చేశారు. ఒకరి కొకరు తినిపించుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలు అధ్యయనం చేయాలనే లక్ష్యంతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన ఏకైక నాయకుడు రాహుల్ అని కొనియాడారు. రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రజలను ఐక్యంగా ముందుకు నడపగలిగిన పరిపాలన దక్షత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. అనంతరం నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ నసురుద్దీన్ , నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటూరి కోటేశ్వరరావు, యడ్లపాడు మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ కరిమూన్, విద్యార్థినులు షేక్ షమ్మీ, ఎస్.అలేఖ్య, భార్గవి, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి : స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేకును కట్ చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని దేశ ప్రజలు చాలా అవసరమని నాయ కులు నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజుపాల్,పిసిసి కార్య దర్శి మాదనశెట్టి వేదాద్రి, షేక్ చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, షేక్ అబ్దుల్ అజీమ్,కోట ఆనంద్, రవితేజ, కొరబండి ఆంటోనీ, జట్టి శేఖర్ ,మీసాల శంకర్, మెకానిక్ శివ,దర్శి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డులపై గ్రామ సభలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం లో 3,080 మంది కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సత్తెనపల్లి మండలం తహశీల్దార్ సిహెచ్ ఉషా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 27 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడిం చారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు :ఖ మండలంలోని కౌలు రైతులకు కౌలు కార్డులు మంజూరు చేయడానికి గ్రామ సభలు జరుగుతాయని మండల వ్యవ సాయ శాఖ అధికారి శాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. 20వ తేదీన లింగంగుంట్ల,మూసాపురం, 21న పాటి బండ్ల, జలాల్పురం, 22న తాళ్లూరు, ఖమ్మంపాడు, 24న కాశి పాడు, బలుసుపాడు 25వ తేదీన హుస్సే నగరం, పెదకూర పాడు -1, 26వ తేదీన పెదకూరపాడు 2 ,3 సచివాలయాల వద్ద గ్రామసభలు జరుగుతాయని వివరించారు.

మొక్కుబడిగా లక్ష్యం.. కౌలు రైతుకు నష్టం

- నూరు శాతం కౌలు కార్డులివ్వండి
- పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల్లోని కౌలుదారుల వినతి

ప్రజాశక్తి-పెదకూరపాడు

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వ్యవసాయ రంగం పైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. కొంత మంది వ్యవసాయంతో పాటు ముఠా కార్మికులుగా, తాపీ మేస్త్రీలుగా, ఇతర వృత్తులకు సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. తమ సొంత భూమితో పాటు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే వారు ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో కౌలు కార్డులు మంజూరు ఆలస్యమైంది. నూరు శాతం కౌలు కార్డులు ఇచ్చే ప్రాధాన్యత క్రమంగా మరిచి పోయి.. మొక్కుబడిగా టార్గెట్లు కేటాయించారు.

ఎక్కువమంది కౌలుదారులు తమకు ఉన్న సొంత భూమి ఎకరం, అర ఎకరంతోపాటు ఐదు ఎకరాలు, 10 ఎక రాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నారు. కౌలు కార్డుల మంజూరుకు సంబంధించిన గ్రామసభలు ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కౌలుదారులు కౌలు కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గం లోని ఐదు మండలాలు పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ.

పెదకూరపాడులో..

పెదకూరపాడులో మొత్తం 20 గ్రామాలు ఉన్నాయి. 14 ఆర్‌బికెలు ఏర్పాటు చేశారు. మొత్తం సాగు విస్తీర్ణం 29,033 ఎకరాలు. అవి 15 వేల 737 మంది రైతుల చేతుల్లో ఉంది. ఇందులో కౌలు రైతుల గుర్తింపు కార్డులు 2,363 ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు.

అమరావతిలో..

అమరావతి మండలంలో 22 గ్రామాల్లో 16 ఆర్‌బికెలు ఉన్నాయి. మండలంలో మొత్తం సాగుభూమి 35,082 ఎకరాలు. 17,590 మంది రైతుల పేర్లపై నమోదై ఉంది. మండలం మొత్తం మీద 2,836 మందికి కౌలు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ మండలంలోని 11 గ్రామాల్లో10 ఆర్‌బికెలు ఉండగా, మండలంలో 14,636 ఎకరాలు సాగు భూమి ఉంది. ఆ భూమి 7,024 మంది రైతుల పేర్లతో రికార్డుల్లో నమోదై ఉంది. మండలంలో 1300 కౌలు కార్డులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

క్రోసూరులో..

క్రోసూరు మండలంలో 20 గ్రామాలు ఉండగా, 15 ఆర్‌బికెలు నడుస్తున్నాయి. మండలంలో సాగుభూమి 28,543 ఎకరాలు కాగా, ఆ భూములు 14,934 మంది రైతుల పేర్లపై నమోదై ఉన్నాయి. ఈ మండలంలో 2,363 కౌలు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు.


దుక్కులతో పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్)

అచ్చంపేటలో..

అచ్చంపేట మండలంలోని 28 గ్రామాలు, 17 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 27, 203 ఎకరాల భూమి సాగులో ఉంది. 12,945 మంది రైతుల పేర్లపై ఆ భూమి ఉంది. ఈ మండలంలో 2,127 కౌలు కార్డులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది.

అర్హులందరికీ కౌలు కార్డులు ఇవ్వండి

కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంత రావు



అర్హులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని నియోజకవర్గ కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హను మంతరావు కోరారు. గ్రామాల వారిగా వాలంటీర్లు, వ్యవ సాయ, రెవెన్యూ శాఖ బృందంతో ఇంటింటికి పంపి వెంటనే అర్హత ఉన్న అందరికీ కౌలు కార్డులు మంజూరు చేయా లని డిమాండ్ చేశారు. మొక్కుబడిగా టార్గెట్లు ఇవ్వడం కౌలు రైతులకు నష్టం చేస్తుందన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


కిట్స్ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యా శాఖ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న స్టూడెంట్స్ కిట్స్ ను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా బిసి సెల్ అధికార ప్రతినిధి కొక్కెర గంగాధర్ యాదవ్ అన్నారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం మండల పరిషత్ బి.సి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ యాదవ్ మాట్లాడుతూ స్కూల్ కిట్స్ లో బ్యాగ్, సమ దుస్తులు, పుస్తకాలు, బూట్లు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి నీతి, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తూ తోటి విద్యార్థుల పట్ల స్నేహంగా, మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కష్టపడి చదవాలన్నారు. పాఠశాలలో సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు దేవిరెడ్డి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాదారులక నేడు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్ లో గురువారం నాడు భారతీయ రిజర్వు బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతా దారుల అవగాహన సదస్సు (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్నెస్) నిర్వహించనున్నట్లు బ్యాంకు ట్రైనర్స్ పి. రవి రాజ్, పధ్వీరాజ్ లు బుధవారం నాడు ఉమ్మడిగా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణ, నియోజకవర్గ స్థాయిలో ఉన్న బ్యాంక్ ఖాతాదారులకు, ప్రజలకు డిపాజిటర్లకు బ్యాంకు ఖాతాల గురించి డిపాజిట్ ల గురించి అవగాహన కలగజేసే కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా, డిపాజిట్ చేసేవారు అవగాహన లేకపోవడం కారణంగా నామిని పేరు రాయకపోవడం, లేదా వారి తద నంతరం డబ్బులు ఎవరు తీసుకోవాలో స్పష్టమైన లిఖితపూర్వమైనవి లేకపోవడం వలన కొన్ని కోట్ల రూపాయలు బ్యాంకుల్లో మిగిలిపోతున్నాయని అన్నారు. అంతేకాకుండా బ్యాంకు సేవలు ఏవి ధంగా ఉపయోగించుకోవాలో, బ్యాంకులో లోపాలు ఏమైనా ఉంటే వాటిని అధిగమించే చర్యలు, ఆన్లైన్ మోసాలు మొదలైన విషయాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాంప్రసాద్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అనిల్ కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సులో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

హ్యూమన్ రైట్స్ మీడియా నేషనల్ సభ్యుడిగా లక్ష్మణ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అండ్ మీడియా ఆర్గనైజేషన్ నేషనల్ లీగల్ సలహా దారు డిగా సత్తెనపల్లి పట్టణానికి చెందిన యువ న్యాయవాది కోటగిరి లక్ష్మణ్‌ను నియమించినట్లు హ్యూమన్ రైట్స్ చైర్మన్ ప్రదీప్ బుధవారం తెలిపారు. సమాజంలో మానవ హక్కుల పరంగా ఎవరికి ఏ సలహా కావాలన్న తనను సంప్రదించవచ్చని, సంస్థ పరంగా ఇప్పుడు ఇంకా తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు.

చెత్తపన్ను నుండి ప్రజలకు విముక్తి


ప్రజాశక్తి-చిలకలూరిపేట

చెత్త పన్ను నుండి ప్రజలకు విముక్తి లభించిందని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ పెంటేల బాలాజి బుధవారం అన్నారు. స్థానిక పండరీపురంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజాసంక్షేమాన్ని మరచి పన్నులు విధించారని, కూటమి పాలనలో చెత్త పన్ను భారం నుంచి ప్రజలకు విముక్తి లభించిందని తెలిపారు. చెత్తపన్ను భారం నుంచి శాశ్వతంగా విముక్తి కలిగిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఈ మేరకు పురపాలక సంఘాల కమిషనర్లకు చెత్తపన్ను వసూళ్ల నిలుపుదల చేస్తూ ఉన్నతస్థాయి నుంచి మౌఖిక ఆదేశాలు చేశా రని పేర్కొన్నారు. రుషికొండపై ప్రజాధనంతో జగన్ నిర్మించిన కట్టడాన్ని ప్రజలకు ఉపయోగపడే భవనంగా మార్చి అందుబాటులో తేవాలని కోరారు.

సమాజ సేవకుడు పివి సురేష్ బాబు సత్కారం

ప్రజాశక్తి-వినుకొండ

సమాజసేవ అంకితమై పనిచేస్తున్న సేవకుడు పీవీ సురేష్ బాబును ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బుధవారం ఘనంగా సత్కరించారు. సందర్భంగా అధ్యక్షులు భువనగిరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాల కృష్ణమూర్తి, కోశాధి కారి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని కాపా డేందుకు 83 సార్లు రక్తదానం చేసి ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న పివి సురేష్



బాబు నేటి యువ తకు స్ఫూర్తి అని తెలిపారు. కరోనా సమయంలో ఎంతో మందికి సేవలందించి కోవిడ్ తో మరణించిన వారికి అంత్యక్రియలు చేసి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. సన్మాన గ్రహీత సురేష్ బాబు మాట్లాడుతూ సేవా కార్య క్రమాలు చేసే తమలాంటి వారికి శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ అధిపతి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, భార్య లీలా వతి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి నాగేంద్ర మాస్టారు, అన్నప్రగడ, రఘు దీక్షితులు, ఆవుల రమేష్ ,శంకర్రావు, సుబ్బా రావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.



తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులో పనిచేయని సిగ్నల్స్



సిగ్నల్స్ ప్రారంభోత్సవంలో అప్పటి ఎమ్మెల్యే శివకుమార్, దాత రాజేంద్రప్రసాద్, అధికారులు(ఫైల్‌ఫోటో)

అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

- దాతల సాయమూ నిర్వీర్యం
- ఆర్భాటంగా ప్రారంభం
- పది రోజులు కూడా పనిచేయని వైనం
- అధికారులు తీరుపై విమర్శలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పట్టుమని పదిరోజులు కూడా పనిచేయలేదు. పట్టణాన్ని పట్టి పీడిస్తున్న ట్రాఫిక్ నియంత్రణకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పరిష్కారం దిశగా అడుగులు వేయలేకపోయినా, దాతలు స్వచ్ఛందంగా స్పందించి సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించారు. కనీసం దానిని కూడా సద్వినియోగం చేసుకోలేని దుస్థితిలో అధికారులున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ కేవలం అలంకారప్రాయంగానే మిగిలాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పట్టణంలో ట్రాఫిక్ సమస్య సుదీర్ఘంగా అపరిష్కృతంగా ఉంది. తెనాలికి చుట్టుపక్కల దాదాపు ఐదారు మండల గ్రామాలకు చెందిన ప్రజలు రోజుకు సరాసరి 40వేల మందిగా పైగా పట్టణానికి వచ్చిపోతుంటారు. వారిలో ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ చేతి వృత్తులవారు, వ్యక్తిగత పనుల నిమిత్తం వచ్చిపోయే వారుంటారు. ప్రజల రాకపోకలకు సంబంధించి వారు వనియోగించే కార్లు, ఆటోలు, బైక్‌ల తాకిడి, పట్టణంలో విద్యాసంస్థల వాహనాల తాకిడి ఉంటుంది. దీంతో ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్ నిలిచిపోవటం పరిపాటిగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని పలు ప్రజా సంఘాలు పట్టణంలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు సిసిఎల్ ప్రొడక్ట్స్ ఇండియా సంస్థ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్‌ను సంప్రదించారు. ఆయన దాదాపు దాదాపు రూ.40లక్షల వరకూ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ కోసం ఖర్చు చేసినట్లు అప్పట్లో కొందరు అధికారులు వెల్ల డించారు.

పట్టణంలో మొత్తం 8 ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. బోస్‌రోడ్డులోని వీనస్ థియేటర్, గాంధీచౌక్, కొత్తవంతెన, మార్కెట్ వంతెన, రైల్వే స్టేషన్‌రోడ్డు, చెంచుపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిగ్నల్స్‌ను అప్పటి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్‌తో కలిసి దాత చల్లా రాజేంద్రప్రసాద్ ఫిబ్రవరి 10, 2024న ప్రారంభించారు. కేవలం వారం రోజులు మాత్రమే ఈ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేసిందని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం సిగ్నల్స్ అలంకారప్రాయంగానే ఉన్నాయి. ఫలితంగా వాహనాల రాకపోయల నియంత్రణ లేదు. ఎవరి ఇష్టం వారిది అన్నట్లు వాహన చోదకులు వ్యవహరిస్తున్నారు. కనీసం సిగ్నల్ పాయింట్లలో పోలీసుల నియంత్రణ కూడా కరువైందన్న ఆరోపణలున్నాయి. దాతలు అందించిన సహకారం కూడా నిర్వీర్యం కావటం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

ఈనాడు దినపత్రిక వ్యవస్థాపకులు రామోజీరావుకు రాజధాని రైతులు ఘనంగా నివాళులర్పించారు. రామోజీ రావు జోహార్ అంటూ స్థానిక రైతు దీక్షా శిబిరం దగ్గర నుంచి కొవ్వొత్తులతో ర్యాలీ జరిపారు.రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధానని ఎలుగెత్తి చాటిన మహనీయులు రామోజీరావని శ్లాఘించారు.పూలతో అలంకరించిన వాహనంపై రామోజీరావు చిత్ర పటాన్ని ఉంచి వివిధ రంగాల్లో ఆయన చేసిన సేవలను మననం చేసుకున్నారు. గ్రంథాలయం సెంటర్ లో మానవహారంగా ఏర్పడ్డారు. జోహార్ రామోజీరావు అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అమరావతి జెఎసి సమన్వయ కమిటీ సభ్యులు పువ్వాడ సుధాకరరావు,దళిత జెఎసి నాయకులు పులి చిన్నా, మేళం భాగ్యరావు, మహిళా జెఎసి నాయకులు యర్రమనేని నాగ మల్లేశ్వరి , వివిధ గ్రామాల నుండి రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగిన ప్రజాదర్బార్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి అమరావతి కరకట్టపై గల సిఎం నివాసం పక్కన ఐటి మంత్రి నారా లోకేష్ చేపట్టిన ప్రజాదర్బార్ బుధవారం కూడా కొనసాగింది. పెద్దఎత్తున తరలివచ్చి ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేశారు. గురువారం నుంచి ప్రజాదర్బార్ నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరలా ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని మంత్రి కార్యాలయ వర్గం తెలియజేసింది.



కృష్ణనగర్‌లో అంగన్‌వాడీ బాట

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని పెనుమాక సెక్టార్ కృష్ణనగర్ 5, 6 అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన బాలలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు లీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.



వెయ్యి స్టూడెంట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థులే దేశ భావి నిర్మాతలని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుత్తికొండ ధనంజయరావన్నారు. బుధవారం సాయంత్రం మంగళగిరి ప్రగడ కోటయ్య, దామర్ల రమాకాంతరావు మున్సిపల్ హైస్కూల్ లో 6 నుంచి 10వ తరగతి వరకు చదివే 1000 మంది విద్యార్థిని విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ధనుంజయరావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థులు చదువు నిమిత్తం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, మీకు అండగా రాష్ట్ర ఐటి,విద్యాశాఖ మంత్రి మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఉన్నారన్నారు. అనంతరం ఆరు నుంచి పది వరకు చదివే విద్యార్థులకు బుక్స్ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్, అందజేశారు. కార్యక్రమంలో హెచ్,ఎం ఎస్ శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వంగర లక్ష్మయ్య, వార్డు అధ్యక్షుడు వంగర సదాశివరావు, నందం బాబురావు, శంకర్రావు ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయని మాధవి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

బాలపురస్కార్ అవార్డులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతిభావంతులైన పిల్లలకు భారత ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు-2025కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారిత అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసాధారణమైన ధైర్యసాహసాలతో నిస్వార్థమైన చర్యలను చేసిన యువ ధైర్యవంతులుకు, అసాధారణ సామర్థ్యాలు, అత్యుత్తమ విజయాలు కలిగిన చిన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇవ్వటానికి ఈ అవార్డులు ఇస్తారన్నారు. రాష్ట్రపతి చేతులమీదుగా జనరిలో న్యూఢిల్లీలో అందచేస్తారన్నారు. ఇతరులకు ఆదర్శంగా ఉండే వారు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు మొదలైన వాటిలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన, భారత సంతతికి చెంది, దేశంలో నివశిస్తున్న వారు, 2024 జులై 31 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు.కావున ఆసక్తి ఉన్న వారు http://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా జులై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని లోకేష్‌కు వినతి

ప్రజాశక్తి - చేబ్రోలు : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌ని ఆయన నివాసములో గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యా యుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమ సమస్యలను మంత్రి లోకేష్‌కు వినతి పత్రం అందజేశారు. పాఠశాల మెర్జింగ్ విషయంలో సమీక్ష చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. పాఠశాల గ్రాంట్లు సకాలములో విడుదల చేయాలని గ్రాంట్లు విడుదల కాకుండా గత సంవత్సరం గడిచిపోయిందని పాఠశాల నిర్వహణ ఖర్చు కొరకు ప్రధానోపాధ్యాయులు



చాలా ఇబ్బంది పడ్డారని, పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్ జూనియర్ అసిస్టెంట్ ఆఫీస్ సబార్డినేట్ నియమించాలని కోరడం జరిగిందని అన్నారు. ఉన్నత పాఠశాలలో యాప్ నిర్వహణ ఆన్లైన్ వర్క్ కొరకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, మెగా డీఎస్ సీ పోస్టు భర్తీ అయ్యేలోపు లోపు ప్రస్తుతం ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ టీచర్ పోస్టులను వర్క్ ఎడ్జిమెంట్ చేయాలని కోరడం జరిగిందని తెలిపారు. హైస్కూల్ ప్లస్ నందు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని కోరడం జరిగింది.పాఠశాల ప్రారంభం రోజులు కనుక 'నేనుబడికి పోతా' కార్యక్రమం జరుగుతున్నందున జూన్ 18 నుండీ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలనుకున్న శిక్షణ కార్యక్రమం ఒక నెల వాయిదా వేయాలని కోరామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమస్యలపై అధికారులతో సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ తెలిపారని, సంఘం నాయకులు, నారాకోడూరు జడ్‌పిహెచ్ గ్రేడ్-2 ప్రదానోపాధ్యాయులు ఎం ఏడుకొండలు తెలిపారు.

23న తైక్వాండో జిల్లా స్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలోని సి కే బాయ్స్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి బాల,బాలికల తైక్వాండో సెలక్షన్ 23 వ తేదీన జరుగుతాయి అని గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లాస్థాయి పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 30 వ తేదీన విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని తైక్వాండో క్రీడాకారులు వినియోగించుకోవాలని, సుబ్బారావు కోరారు.

టైం స్కేల్ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసు పెంచాలి



ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో టైం స్కేల్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ కు టైం స్కేల్ ఎన్ ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి నాగేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. ప్రజా దర్బార్లో నారా లోకేష్ ను కలిసిన పిల్లి నాగేశ్వరావు ఈ మేరకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసు 58 నుంచి 60 ఏళ్లకు పొడిగించారని అది రెగ్యులర్ ఉద్యోగులతో పాటు టైం స్కేల్ ఉద్యోగులకు కూడా వర్తించిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం రెగ్యులర్ విధానంలో ఉన్న ఉద్యోగులకు మాత్రమే ఈ విధానం అమలుపరిచేలా 60 నుంచి 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసును పెంచినట్లు పేర్కొన్నారు. టైం స్కేల్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనంతరం ఎటువంటి పెన్షన్ ఉండదని దయచేసి తమకు 60 నుంచి 62 ఏళ్లకు పొడిగించాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించాం

ప్రజాశక్తి - తెనాలి

తెనాలి పట్టణ, మండల గ్రామాలలో ఈదురు గాలులు భారీ వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ లైన్ల మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి బుధవారం తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోని తెనాలి పట్టణం, తెనాలి రూరల్ మండలం, దుగ్గిరాల, చేబ్రోలు, భట్టిప్రోలు, చుండూరు మండలాలలో మంగళవారం గాలి, భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడి, మెయిన్ లైన్ తీగలు తెగి పడటంతో సిబ్బంది అప్రమత్తమయ్యారన్నారు. అర్ధరాత్రి వరకు శ్రమించి మరమ్మతులు పూర్తిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు చెప్పారు. ఇంకా ఏ ప్రాంతం లోనైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని వినియోగదారులను కోరారు.



బాలాజీ గుప్తాకు పలువురు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో టీడీపీ సీనియర్ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సంకా బాలాజీ గుప్తా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూ బ్యాంక్ కాలనీలో న్యూ బాలాజీ ఫైర్ వర్క్స్ లో బుధవారం పలువురు టిడిపి తమ్ముళ్లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత నాయకులు కొత్తపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాలాజీ గుప్తాను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి చీకుల వెంకటేశ్వరరావు, నాయకులు సుఖమంచి గిరిబాబు, విన్నకోట శ్రీనివాసరావు, రంగశెట్టి సీతయ్య, జనసేన రాష్ట్ర చేనేత భాగం కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు బాలాజీ గుప్తాను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పొగాకు పంటకు మద్దతు ధర

ప్రజాశక్తి - వినుకొండ



మాట్లాడుతున్న డిఎస్ జితేందర్

రానున్న మూడు సంవత్సరాలు పొగాకు పంటకు మంచి డిమాండ్ ఉంటుందని, పంటకు మంచి మద్దతు ధర కల్పిస్తామని ఐటిసి ఉపాధ్యక్షులు డిఎస్ జితేందర్ తెలిపారు. స్థానిక నరసరావు పేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్లో బుధవారం గాడ్ ఫ్రీ ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ వారు పొగాకు రైతులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా నియోజకవర్గం లోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంటకు మంచి డిమాండ్ ఉందని, ఐటిసి పొగాకు పంటకు మద్దతు ధర కల్పిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఏటా పొగాకు సాగు చేయాలని కోరారు. పొగాకును సరైన పద్ధతిలో పండించాలని కోరారు. జనరల్ మేనేజర్ ఎం ప్రభాకర్ రావు, డిప్యూటీ మేనేజర్ వైయస్ పాటిల్ మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు పంటకు కలిగిన డిమాండ్ మరియు సుస్థిరమైన పొగాకు ఉత్పత్తి గురించి వివరించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రవి, పి కృష్ణ, ప్రేమ్, జి రమేష్ రాజు పాల్గొన్నారు.


తనికెళ్ల భరణీని సత్కరిస్తున్న ఓటిఎఫ్ ప్రతినిధులు

సంస్కృతి, ప్రాభవాలను కాపాడుతున్న ఓటీఎఫ్

ప్రముఖ చలన చిత్ర నటులు, దర్శకులు తనికెళ్ళ భరణి

ప్రజాశక్తి-గుంటూరు

'ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి తెలుగు భారతిని' అన్నట్లు కెనడా దేశం టొరంటో నగరంలోని ఒంటారియో తెలుగు ఫౌండేషన్ తెలుగు సంస్కృతి, ప్రాభవాలను సంగీతం, పద్యం, సాహిత్యం, కార్య క్రమాల ద్వారా కొనసాగించటం ప్రశంసనీయమని ప్రముఖ తెలుగు చలనచిత్ర నటులు, దర్శకులు తనికెళ్ళ భరణి పేర్కొ న్నారు. ఒంటారియో తెలుగు ఫౌండేషన్ (ఓటిఎఫ్) ఆధ్వ ర్యంలో కెనడాలోని నగరం గ్రాండ్ సినిమా బాంకెట్ సమా వేశ మందిరంలో 'సంగీతం- పద్యం- సాహిత్యం' కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం లిటిల్ మ్యుసిషన్స్ అకాడమీ చిన్నారులు ఆలపించిన భక్తి పాటలు భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నటుడు భరణి మాట్లాడుతూ కెనడాలోని తెలుగు వారందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉన్నదని శ్రీ సీతారామ సేవా మందిర నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణిని దుశ్శాలువా, పూల దండలు, వెండి కిరీటంతో సత్కరించి 'కళా కిరీటి' బిరుదును ప్రదానం చేశారు. భరణి స్వయంగా రచించిన 'ఆటగదరా శివ', 'నాలోన శివుడు కలడు' వంటి శివ తత్వాలు ఆలపించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్ నీలా, ఇజ్జడ శ్రీని తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తో సురేష్ కుమార్ దంపతులు

మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలకు జడ్పీ చైర్‌పర్సన్ దంపతుల అభినందన

ప్రజాశక్తి తెనాలి


మనోహర్ ను అభినందిస్తున్న జడ్పీ చైర్మన్ దంపతులు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిష్టీనా, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ దంపతులు కలిసి అభినందించారు. విజయవాడలోని మంత్రి చాంబర్లో కలిసిన క్రిస్టీనా దంపతులతో మనోహర్ కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మనోహర్ కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజ నేయులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును క్రిష్టీనా దంపతులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా క్రిస్టీనా మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకున్నారన్నారు. కూటమికి ఘనవిజయం చేకూర్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన ప్రజారాజకంగా సాగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ మరుగున పడిన అమరావతి రాజధాని అభివద్ధి సీఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. వారి వెంట మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్ధపల్లి నాగరాజు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

2047 నాటికి సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే

ప్రజాశక్తి -మంగళగిరి


ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంతిలాల్ దండే

భారతదేశంలో 2047 నాటికి సికిల్ సెల్ (వ్యాధి) రక్తహీనత (ఎనిమియా)ను నిర్మించటమే లక్ష్యంగా గత ఏడాది నిర్మూలన మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతి లాల్ దండే అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం మంగళగిరి నగరంలోని ఎయిమ్స్‌లో జరిగిన అవగాహన సదస్సుకు డాక్టర్ పద్మావతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాంతి లాల్ దండే మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా సికిల్ సెల్ ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న 7 కోట్ల మందికి వ్యాధి పట్ల అవగాహన కల్పించడం నిర్ధారణ పరీక్షలు కౌన్సిలింగ్ నిర్వహించడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. సికిల్ సెల్ చైతన్యం కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాధిని నిరోధించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని దండే అన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా సికిల్ సెల్ ఎనిమియా కనిపిస్తుందన్నారు. ఎనిమియా నిర్మూలన మిషన్లో భాగంగా రాష్ట్రంలోని వైద్య , ఆరోగ్య కుటుంబ సంక్షేమం మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖల సమన్వయంతో పలు కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలన సంబంధించిన గోడ పత్రిక కరపత్రాలను ఆవిష్కరించారు. అవగాహన కార్యక్రమంలో ఎయిమ్స్ డాక్టర్స్ దాస్, నరేష్ , పద్మావతిలు ప్రసంగించారు. ఎయిమ్స్ కు చెందిన మెడికల్ విద్యార్థులు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఎత్తిపోతలలో బుధవారం భారత ప్రభుత్వ ఆదేశాను సారం గిరిజన సంక్షేమం మరియు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సెకిల్ సెల్ ఎనిమియా నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతాంజలి మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఈ సికిల్ సెల్ రక్తహీనతపై అవగాహన డ్రైవ్ జరుగుతుందని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల వారు దీని గురించి తెలుసుకుని రక్త పరీక్షలు చేయించుకోవాలని ఇది వంశపార్యపర్యంగా ఎవరికైనా ఉంటే ఆ కుటుంబ సభ్యులు కూడా కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ. హను మకుమార్, వరలక్ష్మి, తాళ్లపల్లి పీహెచ్ డాక్టర్ వెస్లీ, హెచ్ఎం దుర్గాభవాని పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో టిజెపియస్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు



స్థానిక టిజెపియస్ కళాశాల బి.కామ్ మూడో సంవత్సరం చదువుతున్న ఎన్‌సిసి క్యాడెట్ కె.వంశీ ఫైరింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి, నేషనల్స్‌కు ఎంపికయ్యాడని కళాశాల సెక్రెటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం తెలిపారు. జూన్ చివరలో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వంశీ పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు, ఎన్‌సిసి వంటి విభాగాలలో చేరడం వలన వ్యక్తిగతంగా అభివద్ధి చెందడమే కాకుండా మంచి క్రమశిక్షణ అలవర్చుకొని, దేశానికి పేరు ప్రఖ్యాతలు తెస్తారని పేర్కొన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన కాడేట్‌కి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి మేజర్. పి.కుమార్‌రాజా, వైస్. ప్రిన్సిపాల్ ఏ. భాను మురళి, డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్ తదితరులు అభినందించారు.

అమేజాన్ ఫ్రెష్ ద్వారా ఇంటి వద్దకు కిరాణా సౌకర్యం

ప్రజాశక్తి-గుంటూరు

అమేజాన్ ఫ్రెష్ ద్వారా గుంటూరుతోపాటు దేశంలో 130 నగరాల్లో ఇంటి ముంగిటకే కిరాణా సౌకర్యం అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నాణ్యమైన కూరగాయలు, చిల్డ్ ఉత్పత్తులు, సౌందర్య, బేబీ, పర్సనల్ కేర్, పెట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వంటి తడి, పొడి కిరాణా సరుకుల ఫుల్ బాస్కెట్ కిరాణా సరుకుల సర్వీస్ అందుబాటులోకి వచ్చిందన్నారు. పండ్లు, కూరగాయలను 11వేలకుపైగా రైతుల నుండి సేకరిస్తామని, నాలుగు దశల్లో నాణ్యతా తనిఖీలు చేపడతామన్నారు. నిత్యావసర సరుకుల కోసం ఉత్తమమైన ఆన్‌లైన్ షాపింగ్ అనుభవాన్ని కష్టమర్లకు అందిస్తామని, అంతేకాక క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, డిస్కౌంట్స్ ప్రయోజనాలు కూడా పొందవచ్చన్నారు. అమేజాన్ ఫ్రెష్ కిరాణా సరుకుల కోసం 'అమేజాన్.ఇన్' వెబ్‌సైట్ ద్వారా సులభమైన షాపింగ్ చేయొచ్చన్నారు. అంబాలా, ఔరంగాబాద్, హెరీషియార్‌పూర్, ధార్వాడ్, ఉనా, సూరి వంటి 130 నగరాల్లో అమెజాన్ ఫ్రెష్ సెల్లర్స్, బ్యాంకు భాగస్వాముల నుండి ఉత్తేజభరితమైన డీల్స్ పొందుతారన్నారు. కావున ప్రతి ఒక్క వినియోగదాడు ఆన్‌లైన్ ద్వారా నిత్యావసర సరుకులు పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీరామ్ కోరారు.

పీజీ సెట్‌లో చలపతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రా యూనివర్సిటీ గత నెల 29న వివిధ పీజీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించిన పిజిసెట్‌లో ఫలితాల్లో చలపతి ఫార్మసీ కాలేజి విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో విజయఢంకా మోగించారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫె సర్ నాదెండ్ల రామారావు తెలియజేశారు. పిజి సెట్‌కు 40 మంది హాజరు కాగా 39 మంది అర్హత సాధించారని, వీరిలో సిహెచ్.హరిణి ప్రియాంక రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు, ఎ.విజయలక్ష్మి 32వ ర్యాంకు సాధించారన్నారు. అంతేకాకుండా వందలోపు 8 మంది, వెయ్యిలోపు 30 మంది విద్యార్థులు ర్యాంకులను సాధించారని తెలిపారు. పిజిసెట్ ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయు లు అభినందనలు తెలిపారు.


సిహెచ్ హరిణి ప్రియాంక


ఎ.విజయలక్ష్మీ


68 ర్యాంకు విద్యార్థిని


57 ర్యాంకు విద్యార్థిని

పీజీ ఈసెట్‌లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజి విద్యార్థులు ఏపీ పీజీ ఈసెట్-2024 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యా ధర తెలిపారు. ఈ సందర్భ ంగా డాక్టర్ విద్యాధర మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలు, గుర్తింపు పొందిన పలు ఫార్మసీ కళాశాలల్లో యం.ఫార్మసీ ప్రవేశాలు పొందటానికి నిర్వహించే అర్హత పరీక్ష ఏపి పిజి ఈసెట్ తమ కళాశాల విద్యార్థులు 70 మంది పరీక్షకు హాజరు కాగా, అందులో 67 మంది విద్యార్థులు అర్హత పొందా రన్నారు. అలాగే రెండు వందలలోపు ర్యాంకులు అరుగురు విద్యార్థులు సాధించారన్నారు. డి.రసజ్ఞ 32వ ర్యాంకు, డి.సాయికృష్ణ 88వ ర్యాంకు, బి.ఇందిరా 115 ర్యాంకు, జి.ఉమామహేశ్వరరావు 160వ ర్యాంకు, చెరుకూరి హర్షవర్ధన్, రత్నశ్రీ 211వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎన్.శ్రీనివాస్, కళాశాల కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.


హర్షవర్ధన్


ఇందిర



రసజ్ఞ


రత్నశ్రీ


సాయికృష్ణ


ఉమామహేశ్వరరావు